# మధ్యతరగతి మనస్తత్వం



-శ్రీధర శ్రీరామకృష్ణ

"అమ్మడూ! మామ్మగారు పెళ్ళికొచ్చే మాటైతే, ఆవిడని ఒక కంట కనిపెడుతూ ఉండాలమ్మా! లేకపోతే సబ్బులూ, టూత్ పేస్ట్‌లూ తస్కరించి జాకెట్లో దాచేసుకుంటారు" నవ్వుతూ అన్నాను మా అన్నయ్య గారమ్మాయి కిరణ్మయితో.

"అవునవును!" నా నవ్వుతో శ్రుతి కలుపుతూ అంది తను.

మా తమ్ముడి పెళ్ళి ఇంకో వారం రోజుల్లో ఉండడంతో, ఇంట్లో మా అన్నయ్యలూ, వదినలూ, పిల్లలూ అంతా వచ్చి ఉన్నారు.

"అయినా ఆవిడకదేం బుద్ధి! ఆవిడ వయసేమిటి! ఆవిడ చేసే పనులేమిటి?" అన్నాడు మా తమ్ముడు.

"ఎవరయ్యా ఆవిడ" అంది మా రెండో వదిన కాఫీ అందరికీ అందిస్తూ.

"అదే వదినా! పెద్దన్నయ్యా వాళ్ళింటికి వస్తూంటారు చూడు కామేశ్వరమ్మగారని. పోయినసారి మీరు అన్నయ్య వాళ్ళ దగ్గరి కెళ్ళినప్పుడు 'ఏరా అబ్బాయ్' అంటూ ఒకావిడ వచ్చారనీ, చాలా కలుపుగోలుగా మాట్లాడారనీ చెప్పావే! ఆవిడే. ఆవిడతో బాటు ఆవిడ అవిటి కూతురు కూడా వచ్చిందని చెప్పావు చూడు. ఆవిడ" అన్నాడు మా తమ్ముడు ఆవిడ గురించి మా వదినకు తెలిసేట్టు చెప్తూ.

"ఓహో! ఆవిడా! ఆవిడ దొంగతనం చెయ్యడం ఏమిటయ్యా. చాలా పెద్దతరహాగా కనబడతారుగా."

"అవును వదినా! ఆవిడ అలాంటిదనగానే మాకూ ఆశ్చర్యమనిపించింది. ఒక రోజు మా అన్నయ్య వదినా లేనప్పుడు వచ్చిందట 'ఏరా కుమార్యూ, మీ అమ్మా నాన్నా ఏ్రరా' అంటూ. బజారు కెళ్ళారని చెప్పాట్ట వాడు. వంటింట్లో కెళ్ళి, మంచినీళ్ళు తాగి, పక్కన డబ్బాలో ఉన్న సోపుల్లో రెండు జాకెట్లో దోపుకుంటుంటే, డబ్బా చప్పుడు విని ఏమిటో చూద్దామని లోపలికెళ్ళి వాడు చూశాట్ట. 'ఏంటి మామ్మగారూ?' అంటే 'ఏం లేదురా! డబ్బాలో ఏమున్నాయో చూస్తున్నాను' అందట తత్తరపాటుగా. ఆవిడ సబ్బులు తీయడం వాడు కళ్ళారా చూశాట్ట. ఇంకోసారి అప్పడాలు వత్తటానికని ఎచ్చినప్పుడు, అప్పడాల పిండి కొంగున ముడేసుకుని తీసుకెళ్ళటం కిరణ్మయి చూసిందట."

"అమ్మో! అయితే ఆవిడతో చాలా జాగ్రత్తగా ఉండాలన్న మాట" అంది మా వదిన.

అందరం ఆవిడ గురించి చెప్పకుని నవ్వుకోసాగాం.

అప్పటి వరకూ మౌనంగా ఉన్న మా పెద్ద వదిన అంది "ఆవిడ ఎలాంటిదైతేనేం, మాకు మహోన్నతమైన ఉపకారం చేసింది."

నాకు కాస్త ఆశ్చర్యమనిపించింది.

వాళ్ళ ఆఖరి అమ్మాయి చంటిపిల్లగా ఉన్నప్పుడు వాళ్ళిద్దరూ ఉద్యోగాలకు వెళ్ళిపోతే వాళ్ళు వచ్చేదాకా వాన్ని చూసుకునే వారట. పాలు పట్టటం దగ్గర్నుంచి, అన్ని పనులూ వాళ్ళే చేసేవారట. అలా వాళ్ళు ఒక నాలుగు నెలలు చూసి ఉంటారు.

ఆవిడ ఉపకారం చేసిన మాట నిజమే.

అయితే మరి వాళ్ళ మిగతా పిల్లలు చంటిపిల్లలుగా ఉన్నప్పుడు, మా చెల్లాయిలు చిన్న పిల్లలైనా నిజానికి మా అమ్మా, నాన్నల దగ్గరుండి ముద్దుగా సరదాగా పెరగాల్సిన వయసులోనే వాళ్ళింటికి వెళ్ళి వాళ్ళ పిల్లల ఆలనా పాలనా చూశారు ఏళ్ళతరబడీ! అందుకు వాళ్ళకి కృతజ్ఞత లేకపోగా, చిన్న పిల్లలైన మా చెల్లాయిలు ఏదైనా తప్ప చేస్తే, దాన్ని గోరంతలు కొండంతలు చేసి మా అన్నయ్య చేత చివాట్లు పెట్టించి, లేని పోని దొంగతనాలు వాళ్ళకు అంటగట్టి, వాళ్ళ చిన్నారి మనసుల్ని బాధపెట్టిన మా వదిన అలా అంటం నాకు ఆశ్చర్యమనిపించింది.

ఒకసారి వాళ్ళ అబ్బాయి చిన్నపిల్లాడుగా ఉన్నప్పుడనుకుంటాను. మా రెండో చెల్లాయిని వాళ్ళ పిల్లల్ని చూడటానికని పంపించారు బలవంతంగా. అది వాళ్ళతో వెళ్ళనని ఏడ్చి మొత్తుకుంది. అయినా మా అమ్మా నాన్నా వింటేగా! 'అన్నయ్యా వదినా స్కూలుకు వెళ్ళిపోతే చంటిపిల్లాడ్ని చూట్టానికి ఎవరూ ఉండరమ్మా! మా తల్లి కదూ!?' అని బతిమాలి దానికిష్టం లేకపోయినా వాళ్ళతోబాటు పంపించారు.

ఓ రోజు నేను పని చేసే చోటు నుంచి ఏదో పని మీద వాళ్ళింటికి వెళ్ళిన నేను మా చెల్లాయిని చూసి ఆశ్చర్యపోయాను. మా అమ్మా, నాన్నల గురించి బెంగపెట్టుకున్నట్టుంది. అప్పటికి దానికి పట్టుమని పదేళ్ళు కూడా లేవు. మా వదిన కనుసన్నలలో శక్తికి మించిన పనులు చేస్తూ, బిక్కు బిక్కుమని పడున్న దాన్ని చూస్తే నాకు నిజంగా జాలేసింది. పూటకింత తిండి పడేసి, తామేదో ఘనకార్యం చేస్తున్నామన్నట్టు తమ పిల్లల్ని చూడటం దాని బాధ్యతన్నట్టు వాళ్ళు ప్రవర్తిస్తుంటే నాకు చాలా కోపం వచ్చింది. తమాయించుకున్నాను. ఇంటి కెళ్ళింతర్వాత మా అమ్మా

◆ రాజమండ్రి జెసిరెట్స్‌వారి పోటీలో రూ. 150 ల రెండవ బహుమతి గెలుచుకున్న కథ

నాన్నలతో అన్నాను."వాళ్ళేదో ఇబ్బంది పడతారని బొడ్డాడని పిల్లల్ని కూడా వాళ్ళ పిల్లల్ని చూట్టానికని పంపుతున్నారు. వాళ్ళు అక్కడ పడే ఇబ్బంది మీకు తెలియదు."

"మనవాళ్ళ పిల్లల్ని మనం చూడకపోతే ఎవరు చూస్తారా?" అంటూ తేలిగ్గా నా మాట తీసి పారేశారు. వాళ్ళ విశాల హృదయానికి అభినందించాలో, తెలివి తక్కువదనానికి జాలిపడాలో, మూర్ఖత్వానికి విరాకుపడాలో నా కర్థం కాలేదు. కొన్ని నెలల తర్వాత మా చెల్లాయి వాళ్ళ సెలవలలో మా ఇంటికొచ్చేసింది అక్కడుండలేక.

స్వంతవాళ్ళు ఎంత మన కోసం పాటుబడినా, ఉపకారం చేసినా ఇసుమంతైనా స్పందించని, కృతజ్ఞతా భావం చూపించని మనుషులు, పరాయివాళ్ళు పూచిక పుల్లంత ఉపకారం చేసినా దాన్ని భూతద్దంలో చూసి, దానికి అవసరమైన దానికంటే ఎక్కువ కృతజ్ఞత చూపిస్తుంటారు. ఇంచుమించు మధ్యతరగతి మనుషులందరిలోనూ కనబడే రోగమే ఇది.

మా వదిన అలా అంటంతో నా వెనకాల ఉన్న మచ్చ కూడా నాకు కనబడినట్టయింది.

కష్టపడి, బోలెడంత ఖర్చుపెట్టి నన్ను డిగ్రీ దాకా చదివించిన అన్నయ్యా, వదినలు ఎప్పుడన్నా ఒక మాటంటే వాళ్ళని శత్రువులుగా భావించడం, వాళ్ళు చేసిన దానికి కృతజ్ఞతతో ప్రవర్తించకపోగా, అదేదో వాళ్ళ బాధ్యత అన్నట్టు ప్రవర్తించడం, పరాయి వాళ్ళెవరైనా పది రూపాయలు సాయం చేస్తే వాళ్ళకి కృతజ్ఞుడిగా ఉండి, కనబడిన వాడి దగ్గరల్లా వాళ్ళ గొప్పదనాన్ని పొగడటం లాంటివి చేసిన నాకు ఆ విషయాలన్నీ గుర్తుకు వచ్చి, నేను కూడా సదరు మధ్యతరగతి మనస్తత్వానికి అతీతుణ్ణి కాలేకపోయానే అన్న బాధ కలిగింది నాకు.

దానితోబాటే, వేలకు వేలు అప్పు చేసి ఖర్చు పెట్టి పెళ్ళిళ్ళు చేస్తే, ఇంకా ఏదో తక్కువ చేశారని అన్నదమ్ముల్నీ, తల్లిదండ్రుల్నీ సాధించే ఆడపడుచులు మా బంధువులలో వాళ్ళు ఎంతో మంది గుర్తుకొచ్చారు నాకు.

అయితే, నా కిప్పటికీ ఓ సందేహం! "నాకు, నా తప్పను తెలియపర్చడానికి మా వదిన ఆ మాట అందా, లేక ఆవిడ కూడా ఈ మధ్యతరగతి మనస్తత్వానికి అతీతురాలు కాదా?' ◆

## లోహ విహంగం

రెండు ధృవాల మధ్య నలిగిపోతున్న భూమధ్య
రేఖలా—
ఆర్తితో తెరిచిన నోళ్ళను తప్పుకుని
నేలకు ఒలికిపోతున్న జీవధారలా — జీవితం
శిలువ వేయబడ్డ క్రీస్తులా
గోడకు వేలాడే గోల్డు మెడల్
మరణ వేదనతో గింజుకునే ఆశలా — ఆశయాలు
ఉరికొయ్యమీద పూగే కలలూ — కోరికలూ

వాంటెడ్ కాలమ్స్‌లో మొఖం పాతేసి
ఆదాయం సున్నా అయినా
అప్లికేషన్‌లకు అమ్మపుస్తెల తాడుతో సహా
తగలేసి—
ఆశ ఆకాశంలా ఉరిమినప్పుడు
అప్పుచేసి ఇంటర్వ్యూలకు హాజరు పట్టీ వేయిస్తే
ప్రేమగా పలకరించే రిగ్రెట్ లెటర్


జీవితంలోని లాస్ట్ బట్ ఒన్ మజిలీ లాంటి
మంచంలో — మూల్గుతూ అమ్మ
"నా కొడుకు ఆఫీసర్ కావాలని" కోరుకుంటూ
రక్త మాంసాల్ని కరిగించి — కాల గర్భంలో మొహం
వాటేసిన నాన్న
పెళ్ళికాని చెల్లెలు — జులాయిగా తిరిగే
తమ్ముడు—
మెదడు కుదుళ్ళలో నాగలి చారల్లా!
ఆలోచనల గుండెల్లో దిగబడిన విషపు కోరల్లా!!

ఎకనమిక్స్ ఎం.ఎ.లో యూనివర్సిటీ ఫస్ట్
పరుగెత్తి అలసి — కళ్ళు విప్పితే
ఎదురుగా వెక్కిరించే "నో వేకెన్సీ" బోర్డ్
బాధ్యతల బండరాళ్ళ కింద నలిగి పోతూ
ఎగరాలని వువ్విళ్ళూరే లోహ విహంగం
ఆకాశాన్ని తాకాలని పాకే స్వప్న తరంగం

—సలీం

■ రాజమండ్రి జెసీరెట్స్‌వారి పోటీలో రూ. 150/-లు రెండవ బహుమతి గెలుచుకున్న కవిత.

రాజమండ్రి జెసీరెట్స్‌వారి పోటీలో రూ. 150/- లు
రెండవ బహుమతి గెలుచుకున్న కార్టూన్




రాజమండ్రి జెసీరెట్స్ వారి పోటీలో రూ. 150లు
రెండవ బహుమతి గెలుచుకున్న ఫోటో





 ◆ బహుమతులు అందజేస్తున్నవారు: వందన కంచి శారీస్ - లేడీస్ అండ్ జంట్స్ షోరూమ్స్ కోటిపల్లి బస్టాండ్ దగ్గర, రాజమండ్రి